అప్రమత్తం.. కాకపోతే అనర్థం

- వర్షాకాలం.. పొంచి ఉన్న ప్రమాదం
- తెగిపడిన వైర్లను పట్టుకోవద్దు
- తడి చేతులతో తీగలు, స్తంభాలను తాకరాదు
- సరూర్‌నగర్ డీఈ ఫర్హత్‌అలీ





హుడాకాంప్లెక్స్: 'వర్షాకాలంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అనర్థం చోటు చేసుకుంటుంది. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. గాలికి విద్యుత్ తీగలు తెగిపడుతుంటాయి. నీటిలో సరఫరా అవుతుంటుంది. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం నుంచి బయటపడవచ్చు' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సరూర్‌నగర్ డీఈ ఫర్హత్‌అలీ చెప్పారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులు, వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆయన మాటల్లోనే..

ఎర్తింగ్ లేకపోతే..

➡ తడి చేతులతో స్విచ్‌లు, విద్యుత్ వైర్లను తాకరాదు. ➡ వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు, చెట్లకు దూరంగా ఉండాలి. ➡ వర్షం పడుతున్నప్పుడు.. విద్యుత్ తీగలు, స్తంభాలు తడిసి ఉంటాయి. వాటిని తాకడం ప్రమాదకరం. విద్యుత్ లైన్లకు తగిలే చెట్లకు దూరంగా ఉండాలి. ➡ ఇంటిలో విద్యుత్ వైరింగ్ సరిగా లేకపోతే, షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. అందువలన ఇంటి వైరింగ్‌ను తనిఖీ చేయించి సరి చేయించుకోవడం మంచిది. ➡ ఎర్తింగ్ సరిగ్గా లేకపోతే.. ప్రమాదం జరగవచ్చు. అందుకు ఎర్తింగ్ సరిగా ఉందో చూసుకోవాలి. ➡ వర్షం పడుతున్నప్పుడు ఉపయోగించని పరికరాలను ఆఫ్ చేయాలి. ➡ ముఖ్యంగా పిడుగులు పడుతున్నప్పుడు లేదా విద్యుత్ హెచ్చుతగ్గులు ఉన్నప్పుడు ఇది చాలా ముఖ్యం. ➡ వర్షం పడుతున్నప్పుడు తడిసిన చేతులతో విద్యుత్ పరికరాలను తాకకుండా జాగ్రత్తలు వహించాలి. ➡ విద్యుత్ మోటార్లు, ఫుట్‌వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ సరిగ్గా ఉందో చూసుకోవాలి. ➡ విద్యుత్ మోటార్లు, ఫుట్‌వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ సరిగ్గా లేకపోతే, ప్రమాదం జరగవచ్చు. అందువలన వాటిని తనిఖీ చేయించి సరిచేయించుకోవడం మంచిది. ➡ ఎవరైనా విద్యుత్ షాక్ బారిన పడినట్లయితే, వెంటనే వారిని ఆ పరికరం నుంచి వేరు చేయాలి. తర్వాత వైద్య సహాయం అందించాలి. వర్షాకాలంలో ఈ జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

- యువతను దాడులకు ప్రోత్సహిస్తున్న నాయకులు
- ఏక పక్షంగా వ్యవహరిస్తున్న సీఐ
- వారిపై చర్యలు తీసుకోవాలి
- ముస్లిం నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

మహేశ్వరం: హిందు– ముస్లింలు ప్రశాంతంగా జీవిస్తున్న నాగారం గ్రామంలో కొందరు బీజేపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగా మత ఘర్షణలు సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారని మైనార్టీ నాయకులు లతిఫ్ ఖాన్, ఉస్మాన్, చాన్‌పాషా, షేక్ ఉస్మాన్ ఆరోపించారు. వారితో పాటు.. ఏక పక్షంగా వ్యవహరిస్తున్న సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు గురువారం మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా కొందరు ముస్లింలు వ్యవసాయ పొలం వద్ద ఎద్దును కోశారని తెలిపారు. దీనిని వక్రీకరిస్తూ.. ఆవు(గోమాత)ను కోశారని బీజేపీ నాయకులు మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, కుమార్, ఘనపురం మహేందర్ ముదిరాజ్‌లు తప్పుడు వీడియోలతో సామాజిక మాధ్యమం వేదికగా.. విష ప్రచారం చేశారని విమర్శించారు. యువతను రెచ్చగొట్టి, ముస్లింల ఇళ్లపై దాడికి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఏకపక్షంగా వ్యవహరించి, ముస్లిం మైనార్టీ యువకులపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో వీడియోలను పెట్టారని ఫిర్యాదు చేస్తే.. తమనే దూషిస్తున్నారని వాపోయారు. మతాల మధ్య చిచ్చుపెట్టే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. ఇదే విషయమై.. త్వరలో రాచకొండ కమిషనర్, డీసీపీ, ఏసీపీలకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జహంగీర్, మైమూద్‌ఖాన్, కమాల్‌ఖాన్, నయూమ్ ఖాన్, ఇబ్రహీం, ఫెరోజ్‌ఖాన్, షేక్ హైమద్, మహ్మద్ నజీర్, ఇమ్రాన్‌ఖాన్, మహమూద్‌ఖాన్, అన్వర్‌ఖాన్, షేక్ అమీరుద్దీన్, షేక్ మహమూద్, ఫైజల్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జిల్లెలగూడ ఫీడర్ పరిధిలోని మందమల్లమ్మ ఎక్స్‌రోడ్డు నుంచి టీకేఆర్ కమాన్ వరకు, శక్తినగర్, అంబేడ్కర్‌నగర్, గాయత్రీనగర్, న్యూగాయత్రీనగర్, ఓల్డ్ గాయత్రీనగర్‌కాలనీ, డీఆర్ఆర్‌హోమ్స్, శివసాయి నగర్, హనుమాన్‌నగర్‌లలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. 11కేవీ మీర్‌పేట ఫీడర్ పరిధిలోని ఆర్‌ఎన్‌రెడ్డి నగర్, టీకేఆర్ కళాశాల, గణేష్‌నగర్, రాఘవానగర్, జైల్‌కాలనీ, తిరుమల ఎన్‌క్లేవ్, మీర్‌పేట విలేజ్‌లలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కష్టపడిన వారికి గుర్తింపు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి



జంగారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: కష్టపడిన వారికి కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపునిచ్చి గౌరవిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుగు జంగారెడ్డి అన్నారు. పార్టీ గంగారం నాయకులు.. గురువారం జంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తింపు రాలేదని, పదవులు దక్కలేదని ఎవరూ అసంతృప్తి చెందవద్దని సూచించారు. ఈ పదవితో తన బాధ్యత పెరిగిందన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునావత్ పాండు నాయక్, మునావత్ దేవేందర్ నాయక్, సూర్య నాయక్ పలువురు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

కందుకూరు: ఇటీవల అనారోగ్యంతో మరణించిన బీజేపీ మండల యువ మోర్చా మాజీ అధ్యక్షుడు బుడ్డోళ్ల దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులకు మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో రూ.1లక్ష ఆర్థికసాయం అందించారు. గురువారం మండల పరిధిలోని కటికపల్లిలో నిర్వహించిన దేవేందర్‌గౌడ్ దశదిన కర్మలో పాల్గొన్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి చేతులమీదుగా ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు టి.లక్ష్మణ్‌ముదిరాజ్, అశోక్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, ఎస్.ఎల్లారెడ్డి, ఎన్.నర్సింహారెడ్డి, పి.శ్రీనివాస్‌గౌడ్, జి.ప్రభాకర్, ఇ.రవీందర్‌గౌడ్, రఘునందన్, ఎం.శ్రీకాంత్ ముదిరాజ్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

మహేశ్వరం: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు సరిత అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించి పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యతమైన విద్యాబోధన అందుతుందన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, కంప్యూటర్ గదులు, లైబ్రరీతో పాటు ఆంగ్ల బోధన ఉంటుందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దయ్యాల శ్రీనివాస్, ఇంద్రకంటి వెంకటేశ్‌గౌడ్, బండ నర్సింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ



అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీసీ సీడీపీఓ శాంతిశ్రీ

మహేశ్వరం: చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను గుర్తించి వారి ఇళ్లను సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. పిల్లలకు ఎగ్ బిర్యానీతో పాటు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ఆట వస్తువులతో కూడిన బోధన ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇంద్రకంటి మంజుల, గ్రామపెద్దలు ఇంద్రకంటి వెంకటేశ్‌గౌడ్, దయ్యాల శ్రీనివాస్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి



రంజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: అనారోగ్యంతో మృతి చెందిన మీర్‌పేట మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు తీగల రంజిత్‌రెడ్డి భౌతికకాయానికి గురువారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డిసుధీర్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రంజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం కుటుంబ సభ్యులు పెద్దచెరువు వద్ద గల శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సిద్దాల లావణ్య తదితరులు ఉన్నారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడ్తాల్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు, తాత్కాలిక(అతిథి) మహిళా అధ్యాపకులు కావాలని పాఠశాల ఎస్‌ఓ అనితా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్రాలు బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అర్హతగల వారు ఆయా సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు.. ఈ నెల 18వ తేది సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు కలవని, ఇంగ్లిష్ మీడియం చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

బధిరుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చాదర్‌ఘాట్: నల్లగొండ చౌరస్తాలోని ప్రభుత్వ బధిరులు ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని హిమాయత్‌నగర్ డిప్యూటీ డీఈఓ అస్రా ఫాతిమా తెలిపారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుంటున్నామని ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ స్కాలర్‌షిప్ ఇస్తారని చెప్పారు.

రోడ్డు దుస్థితి పట్టించుకోరా..?

- బీజేపీ నాయకుల మండిపాటు
- నిరసనగా ధర్నా.. కమిషనర్ హామీతో విరమణ



నాదర్‌గుల్ ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: నాదర్‌గుల్ ప్రధాన రహదారికి మరమ్మతు పనులు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అదే రోడ్డుపై ధర్నా చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జి నిమ్మల ఆధ్వర్యంలో వంటా వార్పు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు సునీత, ఇంద్రాసేన మాట్లాడుతూ.. నాదర్‌గుల్ రోడ్డు అధ్వానంగా ఉందని, ప్రమాదాలకు నిలయంగా మారిందని తెలిపారు. మరమ్మతు చేపట్టాలని పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు వేయాలని గతంలో కౌన్సిల్‌లో తీర్మానం చేసి, రూ.1.50 కోట్లు జనరల్ ఫండ్ కింద నిధులు కేటాయించామని తెలిపారు. పనులు ప్రారంభించి రోడ్డును అందుబాటులోకి తేవాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధర్నాతో భారీగా ట్రాఫిక్ స్థంబించి, రాకపోకలకు ఆటంకం కలిగింది. పక్షం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్న కమిషనర్ పి.సరస్వతి హామీతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగు రాంరెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, లక్ష్మణ్, ప్రభాకర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్‌తోనే మాదిగ, ఉపకులాలకు న్యాయం

జిల్లా అధ్యక్షుడు బాబుమాదిగ



నూతన కమిటీకి సభ్యులకు నియామకపత్రం అందిస్తున్న నాయకులు

కందుకూరు: ఎమ్మార్పీఎస్‌తోనే మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబుమాదిగ అన్నారు. మండల పరిధిలోని బాచుపల్లిలో బుధవారం రాత్రి నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 7వ తేదీన మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ సంఘాన్ని ఏర్పాటు చేసి 31 సంవత్సరాలు పూర్తికానున్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకొని, జెండా ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ కమిటీ మండల అధ్యక్షుడు మల్లేపల్లి కృష్ణమాదిగ, ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



బీఎన్‌రెడ్డినగర్‌లో పర్యటించి సమస్యలపై ఆరా తీస్తున్న హేమంత్ కేశవ్‌పాటిల్

ఎల్‌బీనగర్: సమస్యలన్నింటిని దశలవారీగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో పలు కాలనీలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యలతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు కాలనీలవాసులు, కార్పొరేటర్ డివిజన్ సమస్యలపై జోనల్ కమిషనర్ వివరించారు. ఎన్జీవోస్ కాలనీ, సచివాలయనగర్ జరుగుతున్న ఉమెన్స్ థీమ్ పార్కు పనులు వేగవంతం చేయాలి. పార్కులో ఓపెన్‌జీమ్, పిల్లలకు ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఓపెన్ నాల్యాల్లో పూడికతీత పనులు, సాహెబ్‌నగర్ వ్మశానవాటికను అభివృద్ధి చేయాలన్నారు. శ్రీపురంకాలనీ నుంచి వెంకటేశ్వర దేవాలయం వరకు నూతన రోడ్డు, పలు కాలనీలలో వీధీ దీపాలు ఏర్పాటు చేసి గుంతలు పడిన రోడ్లకు మరమ్మతు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్‌రావు, శానిటేషన్ డీఈ నీలిమ, ఎలక్ట్రికల్ డీఈ పున్నానాయక్, ఎంటమాలజీ ఎఈ రవీందర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

వనస్థలిపురం: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనను పురస్కరించుకుని బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా ఆధ్వర్యంలో హయత్‌నగర్ డివిజన్ హుడా సాయి నగర్ కాలనీ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన 'సంకల్పంతో సహకారం– ప్రొఫెషనల్ మీట్ అండ్ పత్రికా సమావేశం'లో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం, యువతకు ఉద్యోగావకాశాలు వంటి అనేక రంగాలలో మోదీ పాలన విప్లవాత్మకంగా నిలిచిందని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలలో ఒక్కటిని కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్, కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు నవజీవన్ రెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు రవిందర్ రెడ్డి, భాస్కర్, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీ



తుక్కుగూడ: రావిర్యాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కమిషనర్ వాణి, ఉపాధ్యాయులు



మీర్‌పేట: విద్యార్థులతో ఉపాధ్యాయులు



కందుకూరు: నేదునూరు పాఠశాలలో..

మీర్‌పేట: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మీర్‌పేట పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను అందజేశారు. 16వ డివిజన్ దీన్‌దయాళ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో మాజీ కార్పొరేటర్ అనిల్ యాదవ్ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయురాలు వింధ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆయన ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా అన్ని వసతులతో పాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఏపీఎస్ చైర్మన్ రాణి, తల్లిదండ్రులు మల్లేశ్, సత్యమ్మ, ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విజయ్ మోహన్‌రెడ్డి, సురేష్, గ్లోరీ, శాంతికుమారి, కౌసల్య, శ్రీవాణి, గిరిజ, అబ్దుల్లా, డా.ఎండీ బషీర్, సర్వర్, హసనుద్దీన్, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుల్లో రాణించాలి

తుక్కుగూడ: విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. రావిర్యాల ప్రాథమిక పాఠశాలలో మొదటిరోజు విద్యార్థులకు, ఉపాధ్యాయులతో కలిసి పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, భోజనం అందిస్తుందన్నారు. విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు, ద్యార్థులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నేతలు'



థీమ్‌పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో నిర్మిస్తున్న ఉమెన్ థీమ్ పార్కు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉమెన్ థీమ్ పార్కు ఏర్పాటుకు గతంలో రూ. లక్షల్లో మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టామని అదనపు నిధులు అవసరం కావటంతో అధికారులతో చర్చించి అవి కూడా మంజూరు చేయించానని పేర్కొన్నారు. అయితే కొందరు కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉన్నామని అధికారులపై ఒత్తిడి పెంచి అభివృద్ధి పనులను నిలిపివేయించారన్నారు. పార్కు పనులు పునఃప్రారంభమయ్యేలా కృషి చేసానని అన్నారు .

ఆరుబయట చెత్త వేయడం నేరం

మున్సిపల్ కమిషనర్ వాణి



తుక్కుగూడలో ఆరుబయట చెత్త వేసిన వారికి జరిమాన విధిస్తున్న మున్సిపల్ అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలో పలు హాట్ స్పాట్స్ కేంద్రాల వద్ద చెత్త వేస్తే భారీ జరిమాన తప్పదని కమిషనర్ ఏ.వాణి హెచ్చరించారు. గురువారం 100 రోజుల ప్రణాళిక 11వ రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గృహాలు, వ్యాపార సముదాయాల వద్ద వినియోగం ద్వారా వచ్చిన చెత్తను మున్సిపల్ వాహనాలకు అప్పగించాలన్నారు. బహిరంగ ప్రదేశాల వద్ద చెత్త వేయడం చట్టరీత్యా నేరమన్నారు. హాట్ స్పాట్స్ వద్ద చెత్త వేస్తున్న వారిని గుర్తించి రూ.11 వేల జరిమాన విధించామన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ పారిశుద్యం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ సామిక్ కుమార్, ఆర్ఐ మల్లేశ్, వార్డు అధికారులు శ్రీహరి, వినయ్‌గౌడ్, ఈఈ ప్రశాంత్, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



పహాడీషరీఫ్: వైద్య శిబిరంలో పాల్గొన్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: మున్సిపాలిటీ సిబ్బంది ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ సిబ్బందికి బాలాపూర్ యూపీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బందికి క్యాన్సర్ పరీక్షలను కూడా నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నిత్యం మున్సిపాలిటీని శుద్ధి చేసే కార్మికులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలుంటాయన్నారు. ఈ క్రమంలోనే సిబ్బంది కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

మీర్‌పేట: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు తరగతి గది, పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదటిరోజు విద్యార్థులకు కమిషనర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణయ్య, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, పారిశుద్ధ్య సూపర్‌వైజర్ దాసరి రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.